## బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి


డీఎంకు వినతిపత్రం ఇస్తున్న కవిత

తొర్రూరు, ఆగస్టు 24: దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి తొర్రూరు డిపో నుంచి ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ గ్రామానికి చెందిన జలగం కవిత శనివారం తొర్రూరు డీఎం పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో బొడ్లాడ గ్రామ పంచాయతీ వరకు వచ్చే ఆర్టీసీ బస్సు కొంతకాలంగా బీసీ కాలనీ వద్ద తిప్పుకొనిని వెళ్తున్నారని తెలిపారు. దీంతో గ్రామస్తులకు అసౌకర్యంగా ఉందని వాపోయారు. గతంలో వలే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని డీఎంను అభ్యర్థించారు.

## గుంజేడు ఈవోగా శేషగిరి బాధ్యతల స్వీకరణ

కొత్తగూడ, ఆగస్టు 24: మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా శేషగిరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన భిక్షమాచారి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకోవడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఈవోగా శేషగిరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయంలో అమ్మవారికి బలి, హలాల్‌ను నిషేధిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వీవోఏల హామీలు అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 24: వీవోఏల హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు నీలం కృష్ణవేణి అన్నారు. శనివారం పట్టణంలో సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం వాటిని విస్మరించిందన్నారు. ఈ నెల 28న పీడీ ఆఫీస్ ఎదుట చేపట్టనున్న ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. లలిత, శోభ, అరుణ, అనిత పాల్గొన్నారు.

## టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

చిన్నగూడూరు, ఆగస్టు 24: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు విజయరాజ్ అధ్యక్షతన మండలశాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడారు. మండలానికి పూర్తిస్థాయిలో విద్యాశాఖ అధికారిని నియమించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకట్రామనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కృష్ణ, హారతి, కార్యదర్శులుగా జే నాగేశ్వర్, సుగుణాకర్, స్వప్నను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి జిల్లా నాయకుడు విష్ణువర్దన్, పరిశీలకులు సువర్ణ తెలిపారు. విష్ణువర్ధన్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాస్, వెంకన్న, ఉస్మాన్, సత్యం, శ్రావణి ఉన్నారు.

## రైతులందరికీ రుణమాఫీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

గార్ల, ఆగస్టు 24: అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గార్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. రైతులను ఇబ్బంది పెడుతూ, బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాలు చుట్టూ తిప్పున కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో జీ సక్రు, రుక్మారావు, మాధవరావు, సర్వయ్య, మంగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 'అంగన్‌వాడీ' హామీలను విస్మరించిన ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

తొర్రూరు, ఆగస్టు 24: రాష్ట్రంలోని గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అనేక రకాలుగా సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్, మినీ టీచర్స్ వేతనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మోసగించిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ సంపూర్ణ, డీ స్నేహబిందు విమర్శించారు. శనివారం పట్టణంలో నిర్వహించిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రాజెక్ట్ కమిటీ సమావేశం గండి శైలజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మినీ టీచర్లకు మెయిన్ టీచర్ల వేతన బకాయిలతో సహా విడుదల చేయాలని, లేకపోతే అంగన్‌వాడీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ జమ్ముల శ్రీను, అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ) నాయకులు పసుల స్వరూప, సుకన్య, మంజుల, ఝాన్సీ, వీరలక్ష్మి, యాకలక్ష్మి, సంధ్యారాణి, సాంబలక్ష్మి, శారద, సరిత పాల్గొన్నారు

## మైనార్టీ కళాశాలలో ఆకస్మిక తనిఖీ


భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణవేణి

డోర్నకల్, ఆగస్టు 24: డోర్నకల్ మైనార్టీ కళాశాలను శనివారం తహసీల్దార్ కృష్ణవేణి తనిఖీ చేశారు. మెనూ, ఆహార పదార్థాలు, పరిసరాలను పరిశీలించి, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కళాశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలిగించొద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజాసుధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు

గార్ల, ఆగస్టు 24: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడిగా ఎస్సై జీనత్‌కుమార్‌ను ఎన్నుకొన్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం, సహజ వనరులపై జీవీవీ ప్రజలకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు. మండల అధ్యక్షుడు సుందర్‌కుమార్, టీటీఎఫ్ నాయకులు శివ, రిటైడ్ ఉపాధ్యాయుడు అప్పయ్య, ప్రిన్సిపాల్ రాజకుమారి పాల్గొన్నారు.

## నర్సింహానగర్ కాలనీలో పట్టపగలే చోరీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 24: పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఘటన పట్టణ శివారు నర్సింహానగర్ కాలనీలో శనివారం జరిగింది. బాధితులు నాయిని మురళీకృష్ణ, మంజుల కథనం ప్రకారం.. తాము పట్టణంలో చిరు వ్యాపారం చేస్తూ జీవిస్తున్నామని, శనివారం ఉదయం వ్యాపారం కోసం బయటకు వెళ్లామన్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, తులం వెండి, రూ.7వేలను చోరీ చేసినట్లు తెలిపారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

## ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలి

తొర్రూరు, ఆగస్టు 24: చేవెళ్ల ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురం రాజ్‌కుమార్ మాట్లాడారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడానికి జనాభా దామాషా ప్రకారం 10శాతం రిజర్వేషన్ అమలు చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి 8 నెలలు గడిచినా నేటికీ ఆ ఊసెత్తకుండా గిరిజనులను మోసం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ, గిరిజన గూడేలు, తండాల్లో రోడ్డు, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న భోజనం' నిధులు పెంచాలి

బయ్యారం, ఆగస్టు 24: మధ్యాహ్న భోజన పథకం నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం బయ్యారంలో వివిధ పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్వే చేసిన ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలు మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని, నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వొద్దన్నారు. మెనూ చార్జీలు పెంచాలని, కార్మికులకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## గీతాంజలి హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 24: పట్టణంలోని గుమ్మడూరు గీతాంజలి హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు విద్యార్థులకు వినూత్న వేషధారణ ధరించారు. గోపికల వేషంలో సంబురాలు చేశారు. సంప్రదాయాలను మర్చిపోకుండా ఇలాంటి వేడుకలు నిర్వహించాలని పాఠశాల డైరెక్టర్ కొనకంచి రామర్రుష్ణ తెలిపారు. ప్రిన్సిపాల్ ఎంఎన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు














